www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 21 సెప్టెంబర్ 2023
5
కాకినాడ



దీక్షలో కుప్పకూలి టిడిపి నేత సత్యవతి మృతి

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

టిడిపి నగర మహిళా అధ్యక్షురాలు చిక్కాల సత్యవతి (45) పార్టీ నిరాహార దీక్షలో బుధవారం కుప్పకూలి మృతి చెందారు. చంద్రబాబు అరెస్టు, రిమాండ్‌కు నిరసనంగా కాకినాడ సిటీ మాజీ ఎంఎల్ఎ వనమాడి కొండబాబు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షల శిబిరంలో బుధవారం సాయంత్రం సత్యవతి ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను టిడిపి నాయకులు హుటాహుటిన ఆసుపత్రికి తీసుకెళ్లే ప్రయత్నం చేసినప్పటికీ అప్పటికే ఆమె మృతి చెందారు.



దీక్షా శిబిరంలో సత్యవతి

డిజిటల్ లావాదేవీలు జరిగేనా..?

- పంచాయతీల్లో ప్రారంభం కాని చెల్లింపులు
- పన్నుల వసూలు, వినియోగంలో పారదర్శక లోపించడంపై విమర్శలు



లావాదేవీలకు పరికరాలే కీలకం

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ప్రజల నుంచి పన్నుల రూపంలో వసూలు చేసిన సొమ్మును పంచాయతీకి జమ చేయకుండా పలువురు సిబ్బంది వాటిని తమ సొంతానికి వినియోగించుకుంటున్న ఘటనలు అనేకం వెలుగు చూస్తున్నాయి. మరోవైపు వివిధ గ్రాంట్లు, ఆర్థిక సంఘాల నుంచి వస్తున్న నిధుల వినియోగం కొన్నిచోట్ల దుర్వినియోగం అవుతోంది. అధికార పక్షానికి చెందిన నాయకులు తమ ఇష్టారీతిన నిధులను ఖర్చు చేస్తూ లెక్కలు కూడా చూపించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. కొన్ని మేజర్ పంచాయతీల్లో అధికారులు, నాయకులు కుమ్మక్కై పెద్ద ఎత్తున నిధులను పక్కదారి పట్టిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రారంభం కాని క్యాష్ లెస్ పేమెంట్స్

గ్రామాల్లో పన్నుల వసూలు నుంచి మొదలుకొని నిధుల ఖర్చు వరకూ పారదర్శకత కోసం కేంద్ర ప్రభుత్వం డిజిటల్ పేమెంట్స్ విధానాన్ని అమలు చేయాలని భావించింది. గత నెల 15 నుంచి అన్ని పంచాయతీల్లో అమలు చేయాలని ఆదేశించింది. జిల్లాలో 20 మండలాల్లో 385 గ్రామ పంచాయతీలున్నాయి. వీటిలో 3 వేలు జనాభా ఉన్న పంచాయతీలు 198, మూడు వేలు పైనే జనాభా ఉన్న పంచాయతీలు 187 ఉన్నాయి. ఈ నేపథ్యంలో డిజిటల్ లావాదేవీల కోసం 358 పంచాయతీలకు ఇప్పటికే అధికారులు బ్యాంకు ఖాతాలను తెరిచారు. నెల రోజులు దాటుతున్నా నేటికీ డిజిటల్ చెల్లింపులు జిల్లాలో ఎక్కడా ప్రారంభం కాలేదు. అధికారుల నిర్లక్ష్యమే ఇందుకు కారణంగా విమర్శలు వినిపిస్తున్నాయి.

లావాదేవీలకు పరికరాలే కీలకం

3 వేలు లోపు ఉన్న పంచాయతీలకు క్యూఆర్ కోడ్లు, ఆపై జనాభా ఉన్నవాటికి పర్చేస్ ఆఫ్ సేల్ (పీవోఎస్) పరికరాల ద్వారా డిజిటల్ లావాదేవీలు నిర్వహించాల్సి ఉంది. వీటిని నేటికి బ్యాంకులు అందజేయలేదు. క్యాష్‌లెస్ చెల్లింపులు కోసం ఇప్పటి వరకు 61 పంచాయతీలకు మాత్రమే క్యూఆర్ కోడ్‌లు, 36 మాత్రమే పీవోఎస్ పరికరాలు బ్యాంకులు అందించాయి. పూర్తిస్థాయిలో ఈ పరికరాలు ఇస్తేనే గాని లావాదేవిలు ప్రారంభం అయ్యే అవకాశం లేదు. క్యూఆర్ కోడ్ అందుబాటులోకి వస్తే వెంటనే వాటిని జిరాక్స్‌లు తీయించి పంచాయతీల్లో ఏర్పాటు చేస్తే ప్రజలు వీటి ద్వారా పన్నులు, ఇతర లావాదేవీలు నిర్వహించడానికి అవకాశం ఉంటుంది. అయితే డిజిటల్ పేమెంట్స్ విధానం జిల్లాలో ఎప్పటి నుంచి అమలు అవుతుందనేది ఇంకా అధికారులు స్పష్టంగా చెప్పలేకపోతున్నారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు త్వరలోనే ఈ విధానాన్ని అన్ని పంచాయతీల్లోనూ అమలు చేస్తామని, ఇక నుంచి ఆస్తి పన్ను ఇంటి పన్ను షాపుల అద్దెలు, లే అవుట్లు, భవన నిర్మాణ అద్దెల అనుమతి కోసం రుసుములు, లైసెన్సుల ఫీజులు ఇలా అన్నీ క్యాష్ లెస్ పేమెంట్స్ రూపంలోనే వసూలు చేస్తామని జిల్లా పంచాయతీ అధికారి విక్టర్ చెప్పారు. క్యూఆర్ కోడ్లు, పిఒఎస్ పరికరాలు రప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

దళిత లబ్ధిదారుల భూముల పరిశీలన

ప్రజాశక్తి-తాళ్లరేవు

దళితులకు గతంలో ప్రభుత్వం ఇచ్చిన భూములను వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో సుబ్బారావు మాట్లాడారు. పటవలలో బూరుగుపుంత ప్రస్తుత పైడా కళాశాల వెనుక ప్రాంతంలో సర్వే నెంబర్ 486/4, 486/ 2లో పంట కాలువ గట్టున ఏడుగురికి ఒక్కొక్కరికీ 30 సెంట్లు చొప్పున 1977లో కేటాయించినట్టు లబ్ధిదారులు తెలిపారు. దడాల సుబ్బరాజు, మురమళ్ల శ్రీను, దడాల సత్యనారాయణ, వేళంగి సత్యనారాయణ, నేల సత్యనారాయణ, మురుగు సాయిబాబు, నాగాబత్తుల అప్పారావు నాయకులతో మాట్లాడారు. ఈ భూముల్లో కొంత మేరకు మొక్కలు వేసామని అయితే ఇటీవల ఆ భూములలో పైడా కళాశాల యాజమాన్యం కళాశాలలోని చెత్తను వేస్తూ ఆ ప్రాంతాన్ని డంపింగ్ యార్డ్‌గా పయోగిస్తోందని తెలిపారు. మరికొంత భూమిలో పైడా కళాశాల అక్రమ కట్టడాలు నిర్మించిందని వాటిని తొలగించాలని, పైడా కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకుని తమ భూములను తిరిగి తమకు అప్పగించాలని లబ్ధిదారులు కోరారు. ఆ భూములను వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు దదాల సుబ్బారావుతో కలిసి సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టేకుమూడి ఈశ్వరరావు, కెఎస్.శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా దడాల సుబ్బారావు విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం 1977లో పటవల పంచాయతీ పరిధిలో ఏడుగురు దళిత లబ్ధిదారులకు ఇచ్చిన భూమిని వారికి అప్పగించాలని సుబ్బారావు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజుబాబు, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు దుప్పి అదృష్టదీపుడు పాల్గొన్నారు. పాల్గొన్నారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న సుబ్బారావు

జగనన్న లేఔట్‌లో కలెక్టర్ పరిశీలన

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

జి.రాగంపేట రోడ్డులోని ఇటిసి లేఔట్‌లోని జగనన్న కాలనీని హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబుతో కలిసి కలెక్టర్ కృతికా శుక్లా బుధవారం పరిశీలించారు. లబ్ధిదారులకు ఉన్న సమస్యలను ఇంటింటికీ వెళ్లి తెలుసుకున్నారు. వాటిని తక్షణమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ హౌసింగ్ అధికారులను ఆదేశించారు. ఇళ్ల నిర్మాణ పనులు, మౌలిక సదుపాయాలపై అధికారుల తీరుపై లబ్ధిదారుల వినతులు, ఫిర్యాదుల నేపథ్యంలో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు పలు సమస్యలను కలెక్టర్ దృష్టి తీసుకొచ్చారు. దీంతో కలెక్టర్ హౌసింగ్ డిఇ రాజ్ కుమార్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్లుకు పనులు అప్పగించి వాటిని పరిశీలించకుండా అధికారులు వదిలిపెడుతున్నారని, అలాంటి అలసత్వం కుదరదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ సుధాకర్ పట్నాయక్, డ్వామా పీడి అడపా వెంకటలక్ష్మి, డిఎల్‌డిఒలు పాఠంశెట్టి నారాయణమూర్తి, ఎండివి ప్రసాద్, ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, ఎంపిడిఒ డి.శ్రీలలిత, వైసిపి రాష్ట్ర నాయకులు ఆవాల లక్ష్మీనారాయణ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఇళ్ల నిర్మాణాల ప్రగతిని పరిశీలిస్తున్న కలెక్టర్

కార్మికుల సమస్యలపై ఎంఎల్‌ఎకు వినతి

ప్రజాశక్తి-కాకినాడ

నగర పాలక సంస్థ కార్మికుల సమస్యలపై బుధవారం సిటీ ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డికి సిఐటియు ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిఐటియు నగర అధ్యక్షుడు పలివెల వీరబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్ళాల్సిన అంశాలు, స్థానికంగా పరిష్కరించాల్సిన అంశాలను ఎంఎల్‌ఎకు వివరించారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారు. పర్మినెంట్ కార్మికులకు బకాయి ఉన్న డిఎలు, సరెండర్ లీవు, మంజూరు చేయాలని, కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ కార్మికులు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, స్పెషల్ శానిటేషన్ వర్కర్స్‌ను ఆప్కోస్‌లో చేర్చాలని, జీతంతో పాటే హెల్త్ అలవెన్సు ఇప్పించాలని, ఆప్కోస్ డ్రైవర్లకు కూడా హెల్త్ అలవెన్సు ఇప్పించాలని, నగర పాలక సంస్థల్లో పని చేస్తున్న కార్మికులకు తదుపరి వేతన సవరణ జిఒలో ఎక్కువగా జీతం ఉండాలని, కాంట్రాక్టు కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, క్లాప్ డ్రైవర్లకు జిఒ నెంబర్ 7 ప్రకారం జీతాలు చెల్లించాలని, సిడిఎంఎతో నిమిత్తం లేకుండా క్లాప్ డ్రైవర్లకు నగర పాలక సంస్థ ద్వారా నేరుగా జీతాలు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి మలక వెంకటరమణ, మున్సిపల్ ఫెడరేషన్ నాయకులు బంగారు సత్తిబాబు, మందపల్లి సూర్యప్రకాష్, ఎం.శివశంకర్, గంగాధర్, సంతోష్, వెంకటేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరించిన కలెక్టర్

జగ్గంపేట రూరల్ : కిర్లంపూడి గోపాలకృష్ణ ఫంక్షన్ హాల్లో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని కలెక్టర్ కృతికా శుక్లా ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంఎల్ఎ జ్యోతుల చంటిబాబు పాల్గొని భూ రీ సర్వే చేసిన నూతన పాస్ పుస్తకాలను కలెక్టర్‌తో కలిసి రైతులకు అందజేశారు. కలెక్టర్ కృతికా శుక్లా ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి అర్జీనీ పరిశీలించి సత్వర పరిష్కారం అయ్యేలా అధికారులు చర్యలు తీసుకుంటారని, తక్షణమే పరిష్కారం అయ్యే అర్జీలను పరిష్కరిస్తారని తెలిపారు.

దళిత హక్కుల ధర్నాపై సంతకాల సేకరణ

ప్రజాశక్తి-పిఠాపురం

కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో దళితుల హక్కులు సామాజిక న్యాయంపై ఈ నెల 29న విజయవాడలో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని బుధవారం మంగితుర్తి గ్రామంలో సంతకాలు సేకరణ చేపట్టారు. కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కె.సింహాచలం మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 76 ఏళ్లు పూర్తి చేసుకున్నా కుల వివక్ష అనేక రూపాల్లో విలయతాండవం చేస్తోందన్నారు. దళితుల చట్టాలను నీర్చుగార్చే విధానాను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్నాయని కాబట్టి దీనికి వ్యతిరేకంగా దళితులు, దళిత సంఘాలు, ప్రజా సంఘాలు, ఉద్యోగ సంఘాలు ఐక్యంగా ఉద్యమించి దళిత చట్టాలను కాపాడుకోలన్నారు. జస్టిస్ పున్నయ్య కమిషన్ సిపర్సులు అమలు చేయాలని, ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు ఇవ్వాలని తదితర డిమాండ్లతో ఈ ధర్నా చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో డెక్కల లాజరు, బండి నూకరాజు, డెక్కల జగ్గారావు, మేడపాటి చంటిబాబు, కె.కామరాజు పాల్గొన్నారు.



సంతకాలు సేకరిస్తున్న కెవిపిఎస్ నాయకులు

మహిళా రిజర్వేషన్ బిల్లుపై హర్షం

ప్రజాశక్తి కాకినాడ రూరల్

కేంద్ర ప్రభుత్వం మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ బిల్లు పెట్టడంపై రాష్ట్ర పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ జమ్మలమడక నాగమణి హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ బిల్లుతో మహిళలకు సముచిత స్థానం దక్కుతుందన్నారు. సిఎం వైఎస్.జగన్ మహిళా రిజర్వేషన్ బిల్లుకు పూర్తి మద్దతు తెలిపారన్నారు. వైసిపి ప్రభుత్వం మహిళా సాధికారతకు అహర్నిశలు కృషి చేస్తోందన్నారు.

అంగన్‌వాడీలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో మినీ అంగన్‌వాడీ వర్కర్, హెల్పర్ ఖాళీ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పెద్దాపురం ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఒ జి.ఉష ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దాపురం నియోజకవర్గ పరిధిలోని మాధవపట్నంలో మినీ అంగన్‌వాడీ వర్కర్ పోస్ట్ భర్తీకి జనరల్ కేటగిరీకి చెందిన స్థానిక మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆర్‌బి.కొత్తూరులో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ హెల్పర్ పోస్ట్ భర్తీకి స్థానికులైన బిసి-బి కేటగిరీకి చెందిన మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తులను ఈ నెల 29వ తేదీలోగా స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో అందజేయాలన్నారు.

ఎంఎల్‌ఎలను కలిసిన ఎపిజెడబ్ల్యుజెఫ్ బృందం

ప్రజాశక్తి-కాకినాడ, రూరల్

అక్టోబర్ 15న కాకినాడలో జరిగే ఎపి వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా మహాసభలకు హాజరవ్వాలని ఎంఎల్‌ఎలు ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి, కురసాల కన్నబాబును ఫెడరేషన్ నాయకులు బుధవారం కలిసి విజ్ఞప్తి చేశారు. దీనిపై వారు సానుకూలంగా స్పందించి, జర్నలిస్టుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎంఎల్‌ఎలను కలిసిన వారిలో ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాతాడ నవీన్‌రాజ్, వీధి గోపి, మున్ని, అధికారి, హసన్, ముమ్మిడి లక్ష్మణ్, బిందాన సురేష్, వాసంశెట్టి శ్రీనివాసరావు, బొండాడ భాస్కర్, దాసరి శ్రీనివాస్, రెడ్డి నాయుడుబాబు ఉన్నారు.

కొనసాగిన టిడిపి నిరసన దీక్షలు

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అరెస్టు, రిమాండ్‌ను నిరసిస్తూ టిడిపి ఆధ్వర్యాన చేపట్టిన దీక్షలు బుధవారం కొనసాగాయి.

ప్రజాశక్తి-యంత్రాంగం

కాకినాడ రాజమండ్రి సెంట్రల్ జైలుకు పోస్ట్ కార్డులు రాసి నిరసన తెలిపినట్లు టిడిపి జిల్లా మహిళా అధ్యక్షురాలు సుంకర పావని తెలిపారు. **కాకినాడ రూరల్** వలసపాకలలో దీక్షలో మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు. కర్రి వెంకట్రాజు, మట్టా ప్రకాష్ గౌడ్, బుంగా సింహాద్రి, బోళ్ల కృష్ణమోహన్, తాతపూడి రామకృష్ణ, సర్దేనాగ హరినాథ్ పాల్గొన్నారు. **కాకినాడ కార్పొరేషన్** 7వ రోజు రిలే దీక్షలో మాజీ ఎంఎల్ఎ వనమాడి కొండబాబు, నాగిడి నాగేశ్వరరావు, మల్లిపూడి వీరు, గుజ్జు బాబు, నల్లూరి శ్రీనివాస్, కేలంగి ప్రసాద్, చిట్నీడి దార, గుర్రాల శ్రీనివాస్, బొంతు సత్యనారాయణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. **పెద్దాపురం** ఆర్‌డిఒ కార్యాలయం వద్ద రిలే దీక్షలు చేపట్టారు. మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, నిమ్మకాయల రంగనాగ్, కొత్తిం వెంకట శ్రీనివాసరావు, రంధి సత్యనారాయణ, ఎలిశెట్టి నాని, తూతిక రాజు, కొరుపూరు రాజు, చాగంటి గోపాలకష్ణ, అరవింద కుమార్, మొయిళ్ల కృష్ణమూర్తి పాల్గొన్నారు. **తుని** యనమల కృష్ణుడు, వనపర్తి బద్రి ఆధ్వర్యాన సంతకాలు సేకరించరాఉ. యనమల శివరామకృష్ణన్, సుర్ల లోవరాజు, చౌక్కా అప్పారావు, పేకేటి హరికృష్ణ, కొడా వెంకటరమణ, కొయ్యా కేశవ్, మళ్ల గణేష్ పాల్గొన్నారు.



కాకినాడ రూరల్‌లో..

ఘనంగా జిల్లా సైన్స్ సెమినార్

ప్రజాశక్తి-కాకినాడ

జిల్లా విద్యాశాఖ అధ్వర్యంలో సైన్స్ సెమినార్ బుధవారం స్థానిక జగన్నాథపురం ఎంఎస్ఎన్ చారిటీస్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సైన్స్ సెమినార్‌కు 28 పాఠశాలల నుంచి 38 మంది విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లా స్థాయిలో ప్రథమస్థానం పొందిన మథర్ థెరిసా మున్సిపల్ ఉన్నత పాఠశాల, గొడారిగుంట విద్యార్థిని ఎ.దీపిక రాష్ట్ర స్థాయికి ఎంపిక అయింది. ష కార్యక్రమాన్ని నిర్వహించిన జిల్లా సైన్స్ అధికారి ఎం.శ్రీనివాస్ వినీల్ మాట్లాడుతూ విద్యార్థులలో శాస్త్రీయ దక్పథం పెంపొందించటానికి సైన్స్ సెమినార్ సహకరిస్తుందని తెలిపారు. అద్భుతమైన ఆహారం, చిరుధాన్యాలు అనే అంశంపై నిర్వహించామని తెలిపారు. డిఇఒ జి.నాగమణి మాట్లడుతూ రాష్ట్ర స్థాయి జాతీయ సైన్స్ సెమినార్ ఈ నెల 25వ తేదిన విజయవాడలో నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్‌ఎం ఎంవిఎస్.రామకష్ణ, జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా సమన్వయ కర్త కేసరి శ్రీనివాసరావు, కౌసల్ జిల్లా సమన్వయకర్త ఎస్.వెంకటేశ్వరరావు, ఎన్.వీరభద్రరావు పాల్గొన్నారు.



సైన్స్ సెమినార్‌లో మాట్లాడుతున్న విద్యార్థులు

ఆధునిక వ్యవసాయంపై నిరంతర అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

ఆధునిక వ్యవసాయ విధానాలపై స్థానిక వ్యవసాయ పరిశోధన కేంద్రం, ఏరువాక కేంద్రాల ద్వారా శాస్త్రవేత్తలు రైతులకు విస్తతంగా అవగాహన కల్పిస్తున్నారని వ్యవసాయ పరిశోధన కేంద్రం అధిపతి డాక్టర్ వి.మునిరత్నం అన్నారు. స్థానిక వ్యవసాయ పరిశోధన కేంద్రంలో బుధవారం అభ్యుదయ రైతులకు నిర్వహించిన ఆధునిక వ్యవసాయ పద్ధతులపై శిక్షణా తరగతులకు ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ శాస్త్రవేత్తలు గ్రామీణ ప్రాంతాలకు వెళ్లి రైతులకు శిక్షణ ఇవ్వటమే కాక వ్యవసాయ పరిశోధన కేంద్రంలో కూడా శిక్షణా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందన్నారు. వివిధ అంశాలపై పరిశోధనలు చేసిన ఏడుగురు నిష్ణాతులైన వ్యవసాయ శాస్త్రవేత్తలు ఈ కేంద్రంలో సేవలందిస్తున్నారన్నారు. వీరి సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ సిహెచ్‌వి.నరసింహారావు వరిలో ఎలుకల నిర్మూలనపై రైతులకు అవగాహన కల్పించారు. డాక్టర్ ఎస్ఆర్ శర్మ వరి, పత్తి పంటలలో చీడ, పీడల నిర్మూలన, పంట పరిరక్షణపై అవగాహన కల్పించారు. డాక్టర్ ఐ.సుధీర్‌కుమార్ అపరాలు, మొక్కజొన్న సాగు విధానాలపై అవగాహన కల్పించారు. డాక్టర్ వి.సుజాత ముఖ్యమైన పంటల యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. అనంతరం పంటల సాగు విధానం, చీడపీడల నిర్మూలన వంటి అంశాలపై రైతులు వ్యక్తం చేసిన సందేహాలను శాస్త్రవేత్తలు నివృత్తి చేశారు. ఈ శిక్షణా తరగతుల్లో అభ్యుదయ రైతులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

పనసపాడులో గడప గడపకూ..


ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

మండలంలోని పనసపాడులో బుధవారం సాయంత్రం 243వ రోజు గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంను జోరుగా చేపట్టారు. ఎపి స్టేట్ హౌసింగు కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి కరపత్రాల ద్వారా వివరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కారానికి భరోసా ఇచ్చారు. మరోసారి సీఎం జగన్‌కు అవకాశం ఇవ్వాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, వైస్ ఎంపిపి ములసా శ్రీను, ఎంపిడిఒ డి శ్రీలలిత తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలి

ప్రజాశక్తి -రౌతులపూడి

రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని కోరుతూ విద్యాశాఖ కార్యాలయం వద్ద యుటిఎఫ్ మండల అధ్యక్షులు కొరుప్రోలు హరిబాబు ఆధ్వర్యంలో బుధవారం నిరసన చేపట్టారు. మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు సబ్జెక్ట్ టీచర్లతో విద్యాబోధన అని చెప్పిన ప్రభుత్వం పాఠశాల ప్రారంభమై మూడు మాసాలైనప్పటికీ అమలకు నోచుకోలేదన్నారు. ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా నాయకులు ఆర్‌విఆర్.మూర్తి, ఉపాధ్యాయులు ఉన్నారు.




కార్టూ'నిజం'

కోడలి నుంచి ప్రాణహాని ఉందని ఫిర్యాదు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

తమ కోడలు, కుటుంబ సభ్యుల నుంచి తమకు ప్రాణహాని ఉందని, తమకు రక్షణ కల్పించాలని కలెక్టర్‌కు ఒక వృద్ధ జంట మొర పెట్టుకుంది. తాళ్లరేవు మండలం పటవల గ్రామానికి చెందిన పితాని బాబూరావు, సింహాచలం దంపతులు తను ఇద్దరు కుమారులు శ్రీను, గోవిందుతో కలిసి కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. పటవలలో తమకు 250 చదరపు గజాల ఇల్లు పూర్వార్జితంగా వచ్చిందన్నారు. పెద్ద కుమారుడు పితాని శ్రీనుకు కె.గంగవరం మండలం అద్దంపల్లికి చెందిన సత్యవేణితో వివాహం అయ్యిందని, వారికి ఇద్దరు కుమారులు ఉన్నారన్నారు. కోర్టు ద్వారా సత్యవేణితో తమ కుమారునికి విడాకులు మంజూర య్యాయన్నారు. సత్యవేణి తన ఇద్దరు కుమారులు సంజయ్, అజయ్‌తో తన కుమారునిపై దాడి చేసి చంపే ప్రయత్నం చేశారన్నారు. ఈ నెల 12న సత్యవేణి కుమారులతో కలిసి తమ ఇంటిపై దాడి చేయగా తాను తన భార్య సింహాచలం భయంతో పారిపోయామన్నారు. వారు తమ ఇంటిని దౌర్జన్యంగా ఆక్రమించారన్నారు.




తీర ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డిఒ సత్యనారాయణ

గణేష్ నిమజ్జన ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి -యు. కొత్తపల్లి

గణేష్ నిమజ్జన ఏర్పాట్లను అధికారులు పటిష్టంగా చేయాలని చూడాలని ఆర్‌డిఒ ఎన్‌విపి. సత్యనారాయణ తెలిపారు. గణపతి నవరాత్రుల నేపథ్యంలో తదనంతరం జరిగే గణేష్ నిమజ్జనానికి సంబంధించి ఉప్పాడ కొత్తపల్లి మండలం సుబ్బంపేటలో నిమజ్జన ఏర్పాట్లను బుధవారం ఆర్‌డిఒ సత్యనారాయణ, డిఎస్‌పి పడాల మురళీ కృష్ణారెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ ఈ నెల 26, 27, 28 తేదీల్లో గణేష్ నిమజ్జనానికి సంబంధించి అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఆర్‌డిఒ వెంట తహాశీల్దారు ప్రసాద్, ఎంపిడిఒ అబ్రహాం లింకన్, సర్పంచ్ ఉమ్మడి జాన్, సిఐ వైఆర్‌కె శ్రీనివాస్ ఉన్నారు.



భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ, వీర్రాజు

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి-పెదపూడి

రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం కషి చేస్తోందని ఎంఎల్ఎ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఎపిత్రయం గ్రామంలో సొసైటీ ఆవరణలో రూ.48 లక్షలతో నిర్మించిన నూతన భవనాన్ని డిసిసిబి చైర్మన్ ఆకుల వీర్రాజుతో కలిసి బుధవారంఆయన ప్రారంభించారు. పిఎసిఎస్ చైర్మన్ గుండా ఈశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంఎల్ఎ మాట్లాడుతూ గ్రామంలో 275 మందికి ఇళ్ల పట్టాలు, అర్హత కలిగిన మహిళలకు కాపు నేస్తం పథకం అందించారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా గ్రామంలో పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.35 వేల బీమా అందజేశారన్నారు. ఆకుల వీర్రాజు మాట్లాడుతూ సొసైటీల సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి తిరుమల, చీఫ్ మేనేజర్ వల్లూరి సునీత, సిఇఒ దేవిశెట్టి ఎంఎం.శ్రీనివాసు, సర్పంచి అడబాల అనురాధ, పెండెం జ్ఞానప్రసూన, అద్దంకి ముక్తేశ్వరరావు, చినబాబు, నక్కా రాజు, గొల్లపల్లి జగన్నాథం, పెండెం వీరబాబు, సత్యనారాయణ పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబాన్ని ఆదుకోవాలని వినతి

ప్రజాశక్తి- రౌతులపూడి

మండల కేంద్రమైన రౌతులపూడిలో వ్యవసాయ కూలి పని నిమిత్తం వెళ్లి పిడుగుపాటుకు గురై మృతి చెందిన గంప సత్యవతి కుటుంబాన్ని ఆదుకోవాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు చిట్టమూరి గోవిందు మతురాలి కుటుంబ సభ్యులతో కలిసి తహశీల్దారు భీమారావుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. మృతురాలి భర్త సైతం అనారోగ్యంగా ఉండడంతో పిల్లల పోషణ ఇబ్బందుకరంగా ఉందని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

నేరాలు ఘోరాలు

కాలువలో యువకుడు గల్లంతు

ప్రజాశక్తి - కడియం

కడియపులంక పంచాయతీ పరిధిలో బుర్రిలంక ఆంజనేయస్వామి కాలువ రేవులో యువకుడు గల్లంతయ్యాడు. స్నానం చేయడానికి అదే గ్రామానికి చెందిన రవ్వల మోహనరావు కాలువ రేవులో దిగాడు. అందరు చూస్తుండగానే కాలుజారి నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాడు. మంగళవారం యువకుడు గల్లంతైనప్పటికీ బుధవారం నాటికి కూడా మతదేహం లభ్యం కాలేదు. నీటిమట్టం అధికంగా ఉండటం వల్ల గాలింపు చర్యలు కష్టంగా మారింది. శ్రీకాకుళం నుంచి నర్సరీలో పనిచేయడానికి రెండు దశాబ్దాల క్రితమే ఈ కుటుంబం వలస వచ్చింది.

చిట్టీల సొమ్ముతో వ్యాపారి పరారు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

చిట్టీల పేరుతో ప్రజల నెత్తిన టోపీ పెట్టి, ప్రజల సొమ్ముతో వ్యాపారి పరారైన సంఘటన మండల కేంద్రం ఉండ్రాజవరంలో చోటు చేసుకుంది. ముత్యాలమ్మపేటలో నివాసం ఉంటున్న పంచాయితీ వార్డు సభ్యుడు కుంట్ల మోహనరావు 20 ఏళ్లుగా చీటీల వ్యాపారం చేస్తున్నాడు. అతడిని నమ్మిన స్థానిక మహిళలు, స్నేహితులు అతని వద్ద చిట్టీలు వేయడం, వడ్డీకి డబ్బులు ఇవ్వడం వంటివి చేస్తున్నారు. ఇలా కష్టపడి దాచుకున్న సొమ్ము, వడ్డీకి ఆశపడి, కొంతమంది మహిళలు తమ బంగారం తాకట్టుపెట్టి మరీ నగదుగా ఇచ్చినట్లు సమాచారం. సుమారు రూ.కోటి 20 లక్షల పైబడి మోసపోయినట్లు 30 మంది మహిళలు బాధితులు పోలీస్ స్టేషన్ వద్ద ఆవేదన చెందుతున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

మద్యం సేవించి వాహనాలు నడుపుతుండగా ముగ్గురిని అరెస్టు చేసినట్లు సామర్లకోట సిఐ కె దుర్గాప్రసాద్ చెప్పారు. సామర్లకోట పట్టణంలో మంగళవారం రాత్రి నిర్వహించిన దాడుల్లో ఎం.నాగేశ్వరరావు, టి.అర్జున్, డి.రవిబాబును అరెస్టు చేసి కాకినాడ కోర్టుకు హాజరు పర్చగా ఒకొక్కరికి రూ.10 వేల చొప్పున రూ.30 వేలు జరిమానాను న్యాయమూర్తి విధించినట్లు సిఐ వివరించారు.

హైవే వాహనాన్ని వ్యాన్ ఢీకొని డ్రైవర్ మృతి

ప్రజాశక్తి-గండేపల్లి

గండేపల్లి మండలం నీలాద్రిరావు పేట శివారులో జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు స్థానికులు తెలిపిన వివరాల మేరకు తొండంగి మండలం శృంగవృక్షం గ్రామానికి చెందిన బి.సతీష్ వ్యాన్‌లో లోడ్ వేసుకుని ఏలూరు నుంచి వస్తుండగా నీలాద్రిరావుపేటలో జాతీయ రహదారిపై నేషనల్ హైవే సంబంధించిన వ్యాన్ నిలుపుదల చేయడంతో అదుపుతప్పి వెనక నుంచి బలంగా ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో సతీష్ కాళ్ళు నుజ్జు నుజ్జయ్యి అక్కడికక్కడే మృతి చెందాడు. వ్యాన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్ మృతదేహాన్ని హైవే సిబ్బంది బయటకు తీశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ వై.గణేష్ కుమార్ తెలిపారు.

25న రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ ఎన్నికలు


సమావేశంలో మాట్లాడుతున్న పద్మనాభం

ప్రజాశక్తి-కాకినాడ

ఈ నెల 25న సూర్య కళ మందిరంలో ఎపి రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ ఎన్నికలు జరుగుతాయని జిల్లా యూనిట్ అధ్యక్షుడు కె.పద్మనాభం తెలిపారు. బుధవారం స్థానికఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. ఈ ఎన్నికలు సజావుగా జరిగే విధంగా అన్ని చర్యలూ తీసుకున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 25 జిల్లాల నుండి ఆఫీస్ బేరర్లు, కార్యవర్గ సభ్యులు సంబంధించి మొత్తం 36 పోస్టులకు ఎన్నిక జరుగుతుందని, ఈ ఎన్నికలో ఓటు హక్కు కలిగిన సుమారు 339 మంది సభ్యులు వీరిని ఎన్నుకుంటారని తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారము ఈ నెల 24న ఆదివారం నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ ఉంటుందన్నారు. ఎన్నిక అనివార్యమైతే సోమవారం 25న ఆయా పోస్టులకు ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో సంఘ కోశాధికారి ఎస్.ఇబ్రహీం, కార్యవర్గ సభ్యులు కె.సుబ్రహ్మణ్యేశ్వర రావు, టి.నూకరాజు, డి.సాల్మన్ రాజు సాజీదు, సుందరమ్మ పాల్గొన్నారు.

డ్రైవింగ్ నిబంధనలు పాటించండి

ప్రజాశక్తి-కోటనందూరు


అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శంకర్రావు

డ్రైవింగ్ నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాలను అరికట్టాలని కోటనందూరు ఎస్ఐ బొచ్చ శంకర్రావు అన్నారు. గురువారం తాటిపాక, జగన్నాథపురం జంక్షన్ కోటనందూరు ప్రాంతాల్లో విస్తతంగా వాహనాలను తనిఖీ చేసి రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. హెల్మెట్, వాహనానికి రికార్డులు, డ్రైవింగ్ లైసెన్స్ లేని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇచ్చి డ్రైవింగ్ చేయించడం వల్ల తరచూ ప్రమాదాలను బారిన పడే విలువైన ప్రాణాలు కోల్పోతున్నారని దీని ద్వారా ఆ కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్నాయని అన్నారు. ఏ విధమైన నిబంధనలో పాటించకుండా వాహనాలు నడుపుతున్న మైనర్లకు ఆయన అవగాహన కల్పించారు. సంఘవిద్రోహ కార్యక్రమాల్లో పాల్గొని అక్రమ కేసుల్లో యువత ఇరుక్కు వద్దని వద్దని సూచించారు.

భీమేశ్వరుని ఆదాయం రూ.14.20 లక్షలు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

పంచారామ క్షేత్రమైన సామర్లకోట శ్రీ కుమార రామ భీమేశ్వరాలయంలో స్వామివారి హుండీల ఆదాయం రూ.14,20,570 వచ్చింది. బుధవారం భీమేశ్వర ఆలయంలో హుండీల ఆదాయ లెక్కింపు కార్యక్రమాన్ని ఆలయ కార్య నిర్వహణ అధికారి డి..నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఒ మాట్లాడుతూ ఆదాయం లెక్కింపు కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు భక్తులు స్వచ్ఛందంగా పాల్గొని సేవలు అందించినట్లు చెప్పారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు దేవాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్మన్ మట్టపల్లి రమేష్ బాబు ఆలయ అర్చకులు పండితులు ధర్మకర్తలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పుష్కర పథకం పంప్ హౌస్ ప్రారంభం

ప్రజాశక్తి-గండేపల్లి

నీలాద్రిరావుపేట పంచాయతీ తాళ్లూరులో పుష్కర ఎత్తిపోతల పంపు హౌస్‌ను ఎంఎల్ఎ జ్యోతుల చంటిబాబు, కలెక్టర్ కృతికా శుక్లా భుదవారం పున్నప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల ఐదు మోటార్లు మరమ్మతులకు గురవవడంతో సాగునీరు అందక రైతులకు ఇబ్బంది కలిగిందన్నారు. తాత్కాలికంగా మోటార్లు రిపేర్ చేయించామని, త్వరలో పూర్తి స్థాయిలో పైపుల మోటర్లు మార్చే దిశగా రూ.35 కోట్లతో ప్రతిపాదనలు పంపామన్నారు. ఈ కార్యక్రమంలో జ్యోతుల రామస్వామి, ఎంపిఇ చలగళ్ల దొరబాబు, జెడ్‌పిటిసి పరిమి వెంకటలక్ష్మి మంగతాయారు బాబు, వైస్ ఎంపిపి కుంచే రాజా, మార్కెట్ యార్డ్ చైర్మన్ జనపరెడ్డి బాబు, జగ్గంపేట ఎంపిపి అత్తులూరి నాగబాబు, జగ్గంపేట జెడ్‌పిటిసి ఒమ్మి రఘురాం, కందుల చిట్టిబాబు, జాస్తి వసంత్ పాల్గొన్నారు.

హాస్టల్ మెస్ ఛార్జీలు పెంచాలి

ప్రజాశక్తి-కాకినాడ

హాస్టల్ విద్యార్థులకు మెస్ ఛార్జీలు పెంచాలని స్థానిక ఇంద్రపాలెం లాకుల వద్ద గల అంబేద్కర్ విగ్రహం వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.గంగాసూరిబాబు, జిల్లా కమిటీ సభ్యులు సాహిత్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు అధికారంలోకి రాకముందు మేము అభివృద్ధి చేస్తామని చెప్పి నేటికీ నాలుగేళ్లయినా ప్రభుత్వం సంక్షేమ హాస్టల్స్‌ను గాలికి వదిలేసిందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు రోజుకు రూ.53 ఇచ్చి మూడు పూటలా భోజనం చేయండని చెప్పడం విడ్డూరంగా ఉందని ఇప్పుడున్న కాలంలో రూ.53కు ఎవరైనా మూడు పూటలా సంతప్తికరంగా భోజనం చేయగలరా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పావన్, కృప పాల్గొన్నారు.

వికలాంగ పిల్లల క్రీడలు ప్రారంభం

ప్రజాశక్తి-కాకినాడ

స్థానిక పిఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వికలాంగ పిల్లల ఆటల పోటీలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి, కలెక్టర్ కృతికా శుక్లా జాతీయ జెండాను ఆవిష్కరించి, స్పోర్ట్స్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ పోటీలకు జిల్లావ్యాప్తంగా వివిధ మండలాల నుండి 360 మంది అంధ, చెవిటి, మూగ, మేధోపరమైన వైకల్యం, మస్తిష్క పక్షవాతము, అప్పర్ లింబ్స్, లోయర్ లింబ్స్ (అవయవాల లోపం), మానసిక మాంద్య, విద్యార్థులు పాల్గొన్నారు. వీరు రన్నింగ్ రేస్, సాఫ్ట్బాల్, త్రో బాల్, స్లో వాక్, లాంగ్ జంప్, షాట్‌పుట్ తదితర ఆటల పోటీలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ, కుడా చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, డిఇఒ జి.నాగమణి, చామంతి నాగేశ్వరరావు, డి.సుభద్ర, ఆర్‌జెడి.రాజు, ఎల్.గణేష్ బాబు, తుమ్మల రంగా, బంగారు రాజు పాల్గొన్నారు.

జుట్టు కత్తిరించిన టీచర్ సస్పెన్షన్

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

స్థానిక సూర్యనారాయణపురం సర్వేపల్లి రాధాకృష్ణ మున్సిపల్ పాఠశాలలో విద్యార్థినుల జడలను కత్తిరించిన పాధ్యాయునిపై అధికారులు చర్యలు చేపట్టారు. విద్యార్థినులు జుట్టు విరబోసుకుని రావడంతో కోపోద్రక్తురాలైన ఉపాధ్యాయుని మంగాదేవి విద్యార్థుల జడలను కత్తిరించి వేయడం వివాదానికి తావిచ్చింది. తల్లిదండ్రుల ఆందోళన చేయడంతో పాఠశాల విద్యాశాఖ అధికారులు రంగంలోకి దిగి విద్యార్థినుల వాంగ్మూలం తీసుకొన్నారు. ఎంఇఒ గణేష్ బాబు, విచారణ నిర్వహించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారు. దీనిపై స్పందించిన డిఇఒ ఉపాధ్యాయిని మంగాదేని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

అత్యవసర సిగ్నలింగ్ వ్యవస్థపై అవగాహన

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

రైల్వే అత్యవసర సిగ్నలింగ్ వ్యవస్థపై సామర్లకోట రైల్వే స్టేషన్లో బుధవారం ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సామర్లకోట రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ ఎం.రమేష్ ఆధ్వర్యంలో సహాయ స్టేషన్ మాస్టర్లకు, పాయింట్స్ మాన్స్‌కు క్షేత్రస్థాయిలో ప్రయోగాత్మక శిక్షణా తరగతులు నిర్వహించారు. రైలు ఒక ట్రాక్ నుంచి మరొక ట్రాక్‌కు మారేటపుడు క్యాబిన్‌లలో సిగ్నలింగ్ వ్యవస్థలో సాంకేతిక లోపాలు తలెత్తినపుడు సిగ్నలింగ్ వ్యవస్థ పనిచేయక పోతే మాన్యువల్‌గా క్షేత్రస్థాయిలో సిగ్నల్ పాయింట్‌లను ఇంటర్ లాకింగ్ ద్వారా పని చేసే విధానంపై రమేష్ వివరించారు. ఈ సందర్భంగా క్షేత్ర స్థాయిలో ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు.

యానాం వార్తలు


పిడబ్ల్యూడి కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఎన్ఎంఆర్ ఉద్యోగులు

సమస్యలపై ఎన్ఎంఆర్ ఉద్యోగుల ఆందోళన

ప్రజాశక్తి - యానాం

యానాం ప్రజా పనుల శాఖలో 14 ఏళ్లుగా పని చేస్తున్న ఎన్ఎంఆర్ ఉద్యోగులు తమ డిమాండ్లు నెరవేర్చాలని బుధవారం పిడబ్ల్యుడి కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్.రంగస్వామి గత అసెంబ్లీ సమావేశాల్లో రూ.18 వేల వేతనాలు పెంచుతున్నట్లు ప్రకటించారని కానీ ఇప్పటివరకు అమలు చేయలేదన్నారు. దీంతో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకుడు శర్వానంద్ ఆధ్వర్యంలో పుదుచ్చేరివ్యాప్తంగా ఈ ఆందోళన చేపట్టినట్లు తెలిపారు. పిడబ్ల్యుడిలో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలన్నారు. బుధవారం జరిగే అసెంబ్లీ సమావేశాల్లో తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. ఎన్ఎమ్ఆర్ ఉద్యోగులకు వివిధ సంఘాల నాయకులు, కాంగ్రెస్ నాయకుడు మల్లాడి సత్తిబాబు మద్దతు తెలిపారు.


అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొన్న ఎంఎల్ఎ అశోక్

అసెంబ్లీ సమావేశాల్లో ఎంఎల్ఎ అశోక్

ప్రజాశక్తి - యానాం

కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో అసెంబ్లీ సమావేశాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సమావేశానికి స్పీకర్ సెల్వం ముఖ్యమంత్రి రంగస్వామి, మంత్రులు, ఆయా ఎంఎల్ఎలతో పాటు యానాం ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పాల్గొన్నారు.

ఒబిసి రిజర్వేషన్లపై సమావేశం

ప్రజాశక్తి - యానాం

యానాం నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఒబిసి రిజర్వేషన్‌పై వార్డుల వారీగా గుర్తించేందుకు మద్రాస్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి కెకె.శశిధరన్ నేతృత్వంలో కమిషన్ బృందం యానాంలో బుధవారం సమావేశం నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమావేశపు హాల్లో వివిధ రాజకీయ పార్టీలు యానాం ప్రముఖులు పలు సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఒబిసి రిజర్వేషన్‌కు సంబంధించిన వివిధ అంశాలపై చర్చించారు. ముఖ్యంగా మూడు నెలలపాటు అంగన్వాడి టీచర్లతో యానాం నియోజకవర్గంలో ఇంటింటా సర్వే నిర్వహించి వారి కుల తదితర అంశాలను సేకరించి నివేదికను సిద్ధం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అరుల్ ప్రగాశం తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్‌సి ఇజ్రాయిల్‌కు సత్కారం

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

ఉప్పలగుప్తం పంచాయతీ పెద్దూరు ఆర్‌సిఎం చర్చి వార్షికోత్సవ సభలో బుధవారం ఎంఎల్‌సి బొమ్మి ఇజ్రాయిల్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎంఎల్‌సి గా బాధ్యతలు చేపట్టి మొదటిసారి చర్చికి విచ్చేసిన సందర్భంగా పాస్టర్ పినిపే జయరాజ్ ఆధ్వర్యంలో ఇజ్రాయిల్‌ను దుశ్శాలువా కప్పి పూల మాలతో ఘనంగా సత్కరించారు. జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు మోటూరి సత్యం కాపు, తొత్తరమూడి బాబులు, చేట్ల విద్యాసాగర్, పెయ్యల రమణ, సంఘ పెద్దలు జోన్నాడ ఆదినారాయణ, తవిటికి చిట్టిబాబు, బాబ్జీ రావు, కె.కృష్ణమూర్తి, ఎం.సత్యనారాయణ, టి.జోయల్ పాల్గొన్నారు.

స్త్రీ నిధి నిధుల రికవరీ

ప్రజాశక్తి - ఐ.పోలవరం

పాతఇంజరం పంచాయితీ పరిధిలో ఉన్న డ్వాక్రా సంఘాలను బుధవారం స్త్రీనిధి జిల్లా ఎజిఎం డి.ప్రసన్నలక్ష్మి తనిఖీ చేశారు. లక్ష్మీదుర్గ, కీర్తి, మేరిమాత సంఘాల వద్ద స్త్రీనిధి నిధులు రూ.21,500 రికవరీ చేశారు. పేటిఎం ద్వారా కట్టించుకుని రసీదు ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ ఇకపై ఎటువంటి అవకతవకలు లేకుండా పేటిఎం ద్వార స్త్రీనిధి సొమ్మును చెల్లించి రసీదు తీసుకోవాలని డ్వాక్రా మహిళలకు సూచించారు. ఆమె వెంట స్త్రీనిధి మేనేజర్ అవినాష్, ఎపిఎం శ్రీనివాసరాజు యానిమేటర్లు ఉన్నారు.

విద్యార్థుల సంఖ్యను పెంచాలి

ప్రజాశక్తి - ఆలమూరు

కొత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నూతన అడ్మిషన్ల ద్వారా విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచడానికి అధ్యాపకులు, కళాశాల అభివృద్ధి కమిటీ కషి చేయాలని రాజమహేంద్రవరం జోన్-2 రీజనల్ జాయింట్ డైరెక్టర్ చప్పిడి కృష్ణ అన్నారు. బుధవారం ఆయన కళాశాలను సందర్శించి రికార్డులను పరిశీలించారు. ప్రిన్సిపల్, అధ్యాపకులు, నాన్ టీచింగ్ సిబ్బంది, విద్యార్థులతో ఆయన మాట్లాడారు. కళాశాలకు అవసరమైన తెలుగు, బోటనీ, జువాలజీ అధ్యాపకులను సమీప కళాశాలల నుంచి సర్దుబాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట ప్రిన్సిపల్ డాక్టర్ వి.నరసింహ స్వామి, అధ్యాపకులు రామారావు, కళాశాల కమిటీ సభ్యులు గుణ్ణం వీర్రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి - రామచంద్రపురం

శ్రీమతి డొక్కా సీతమ్మ అసరా పథకం ద్వారా మూడు కుటుంబాలకు నిత్యావసర సరుకులను బుధవారం పంపిణీ చేశారు. పోలిశెట్టి లక్ష్మీసుబ్బారావు మెమోరియల్ చారిటబుల్ ఫౌండేషన్ ద్వారా పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో చోడవరం గ్రామంలో కొండమంచిలి రాంబాబు కుటుంబ సభ్యులకు, ఆర్యావటం గ్రామం హుడావారిపేటలో ఉప్పాడ మధుబాబు కుటుంబానికి, చిన్న తాళ్లపాలెం గ్రామంలో పోలినాటి రామకృష్ణ కుటుంబానికి వీటిని అందించారు. ట్రస్ట్ చైర్మెన్, జనసేన పార్టీ ఇన్‌ఛార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, సోదరుడు పోలిశెట్టి శ్రీనివాస్ చేతుల మీదుగా వీటిని కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

'టిడ్కో' రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

టిడ్కో గృహాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పూర్తి చేసి త్వరితగతిన లబ్దిదారులకు అప్పగించాలని కమిషనర్ కె.దినేష్‌కుమార్ ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం టిడ్కో, హౌసింగు మరియు మెప్మా అధికారులతో సమీక్షించారు. టిడ్కో గృహాలకు సంబంధించి వివిధ దశల్లో ఉన్న రుణాలను 15 రోజుల్లోగా విడుదల అయ్యేలా చూడాలని, మార్ట్ గేజ్ లను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. అనారోగ్యంతో బాధపడుతూ కదలలేని వారికి రిజిస్ట్రేషన్లను వారి ఇంటికి వెళ్లి మార్ట్ గేజ్‌లు పూర్తి చేయాలన్నారు. ఇంకా లబ్దిదారుని వాటా చెల్లించని వారికి నోటీసులు యిచ్చి వెంటనే వారి యొక్క వాటా చెల్లించేలా చూడాలని ఆదేశించారు. పిఎం స్వనిధి పథకంలో దాఖలైన దరఖాస్తులను పూర్తి స్థాయిలో బ్యాంకులకు అప్పగించాలన్నారు. స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా అధికారులతో మాట్లాడి సంబంధిత యూనిట్లు ప్రారంభం అయ్యేలా చూడాలని తెలిపారు. కమ్యూనిటీ ఆర్గనైజర్లు ఈ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని సూచించారు. మెప్మా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇతర పథకాలు కూడా యుద్ధప్రాతిపదికన ప్రారంభించాలని అన్నారు. అదనపు కమిషనర్ పిఎం. సత్యవేణి, టిడ్కో ఎస్ఈ శ్రీనివాసరావు, సెక్రటరీ ఎస్. సత్యవతి, మేనేజరు ఎం.డి. అబ్దుల్ మాలిక్ అస్ఫర్, సిఎంఎం రవి శంకర్, హౌసింగ్, టిడ్కో మరియు మెప్మా అధికారులు పాల్గొన్నారు.

యువతలో నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు శిక్షణ

ప్రజాశక్తి - రాజానగరం

యువతలో ఉన్న నైపుణ్యతను వెలికితీసేందుకే ఆయా విభాగాల్లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని జాయింట్ కలెక్టర్ ఎన్ తేజ్ భరత్ అన్నారు. బుధవారం నన్నయ యూనివర్సిటీలో జిల్లా స్థాయి యువజనోత్సవ కార్యక్రమాన్ని జెసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతీ, యువకుల్లో దాగి ఉన్న ప్రతిభా నైపుణ్యాలను వెలికి తీసేందుకు జిల్లాస్థాయి యువజన కార్యక్రమాలు ఎంతగానో తోడ్పాటునిస్తాయన్నారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని యువజన సర్వీసుల శాఖ, సెట్రాజ్ ఆధ్వర్యంలో తూర్పు గోదావరి, కాకినాడ, కోనసీమ జిల్లాల్లో నిర్వహిస్తున్నారని తెలిపారు. 15-29 సంవత్సరాల గల యువతీ, యువకులకు జానపద నత్యం (గ్రూపు, సోలో), జానపద గేయాలు (గ్రూపు, సోలో), జీవన నైపుణ్యంలో కథ రాయడం, పోస్టర్ తయారీ, ఫోటోగ్రఫి, ఉపన్యాసం వంటి అంశాలపై శిక్షణ ఉంటుందన్నారు. సెట్రాజ్ అధికారి కె. రమణి తూర్పు గోదావరి జిల్లా స్థాయి యువజనోత్సవాలు-2023ను ఆదికవి నన్నయ్య యూనివర్సిటీలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థాయి విజేతలను, రాష్ట్ర స్థాయి పోటీలకు మరియు రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం పొందిన విజేతలను జాతీయస్థాయి పోటీలకు పంపించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విసి కె. పద్మ రాజు, రిజిస్ట్రార్ ఆచార్య కె. సుధాకర్, సెట్రాజ్ మేనేజర్ కె. ఎస్.వి. కాశీ విశ్వేశ్వర రావు, సూపరింటెండెంట్ సివి.సూర్యనారాయణ, ఫీల్డ్ ఆఫీసర్ కెఎన్‌వి.గౌతమ్ రాజ్, న్యాయ నిర్ణేతలు మరియు సెట్రాజ్ సిబ్బంది పాల్గొన్నారు.

సిసి రోడ్డు పనుల పరిశీలన

ప్రజాశక్తి - మండపేట

పట్టణంలోని 1వ వార్డు విజయలక్ష్మి నగర్‌లో చేపట్టిన సిసి రోడ్డు నిర్మాణ పనులను మున్సిపల్ చైర్మన్ పతివాడ నూక దుర్గారాణి, వార్డు కౌన్సిలర్ పోతంశెట్టి ప్రసాద్, టౌన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పురపాలక సంఘం సాధారణ నిధులు రూ.1.05 కోట్లతో ఈ పనులు చేపడుతున్నామన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. అదేవిధంగా మండపేట - తాపేశ్వరం రోడ్డు పనులను ఎంపిపి ఉండమట్ల శ్రీనివాస్, కేశవరం ఎంపిటిసి సభ్యులు చంద్రమళ్ల పోతురాజు పరిశీలించారు.

నిరసనలను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - అయినవిల్లి

టిడిపి అధినేత చంద్రబాబుఅరెస్టు నేపథ్యంలో పార్టీ చేపట్టే నిరసనల్లో ప్రతి కార్యకర్తా స్వచ్ఛందంగా పాల్గొని జయప్రదం చేయాలని టిడిపి మండల అధ్యక్షులు చిట్టూరి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. టిడిపి మండల అత్యవసర సమావేశం ఆయన అధ్యక్షతన బుధవారం శానిపల్లిలంకలో జరిగింది. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి మద్దాల సుబ్రహ్మణ్యేశ్వరావు, హెచ్‌ఆర్‌డి సభ్యులు నేదునూరి వీర్రాజు, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కుడుపూడి దుర్గారావు, సర్పంచుల సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు కాకర శ్రీనివాస్, అధికార ప్రతినిధి బొబ్బా ప్రభాత్‌కుమార్, పార్లమెంట్ అధికార ప్రతినిధి మోత వెంకటేశ్వరావు, క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు వి.శ్యామ్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు

ప్రజాశక్తి - అమలాపురం

సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో ప్రభుత్వం వెలుగులు నింపుతుందని ఎంఎల్‌సి బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. బుధవారం అల్లవరం మండలం గోడితిప్ప పంచాయతీలో గడపగడపకూ మనప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాలు, జగన్ చేస్తున్న అభివృద్ధిని ప్రజలకు వివరించారు. వాటి అమలు తీరుపై ఆరా తీశారు. అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను కుల, మత, పార్టీలకతీతంగా అమలు చేస్తుందన్నారు. వాలంటీర్, సచివాలయం వ్యవస్థలతో ఇంటి వద్దకే పథకాలు వస్తున్నాయన్నారు. గ్రామంలో తన దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిట్టీనిడి శ్రీదేవి, ఎండిఒ ప్రసాద్, ఎంపిడిఒ కృష్ణ మనోహర్, ఎంపిపి ఇళ్ల శేషారావు, వైసిపి మండల అధ్యక్షుడు కొనుకు బాపూజీ, వైస్ ఎంపిపి వడ్డీ గంగ, ఎంపిటిసి సభ్యులు పులుసుగంటి రాజేశ్వరి, సర్పంచ్‌లు తిక్కిరెడ్డి శ్రీనివాస్, బర్రె సీతారత్నం, ఎంఎంసి డైరెక్టర్ పాటి శ్రీరామ్, వార్డు సభ్యులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వర్గీకరణ బిల్లు కోసం ఎంఆర్‌పిఎస్ దీక్షలు

ప్రజాశక్తి- అమలాపురం, అమలాపురం రూరల్

ప్రత్యేక పార్లమెంట్ సమావేశంలో ఎస్‌సి వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలంలూ అల్లవరం మండలంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద ఎంఎస్‌పి అమలాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి లూటుకుర్తి చిన్న ఆధ్వర్యంలో ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షులు యార్లగడ్డ రామకృష్ణ అధ్యక్షతన నిరసన దీక్షను బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు ఎస్.బైరమూర్తి, వై.సత్తిబాబు, ఎ.మోహన్, ఎల్.రామకృష్ణ, ఎ.రమేష్, రామరావు, ఎల్.సుభాష్ శెట్టి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మంద కృష్ణ ఆదేశాల మేరకు వల్లూరి సత్తిబాబు, యార్లగడ్డ సత్తిబాబు ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద చేపట్టిన దీక్షలు బుధవారం నాటికి 13వ రోజుకు చేరాయి. ఈ దీక్షలో గంపల సత్యప్రసాద్, వై.రవీంద్ర, హృదయకృష్ణ, ఎన్.నాని, ఎస్.దుర్గారావు, సిహెచ్.సత్తిబాబు పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి - గోపాలపురం

వినాయక చవితి సందర్భంగా మహిళలకు నిర్వహించిన వివిధ ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. మహిళలకు కుర్చీల పోటీలు, హౌసి, లెమన్ స్పూన్ పోటలు నిర్వహించారు. మహిళలు యువత పిల్లలు అధిక సంఖ్యలో ఈ పోటీలకు పాల్గొని ఆనందంగా సంతోషంగా తిలకించారు. సంస్కతి ఆటపాటలతో పోటీలతో సంతోషంగా పండుగలు జరుపుకోవాలని వైసిపి నాయకులు ఎస్‌కె ఖాదర్ వలీ అన్నారు. విజేతలకు సుమారు 20 వేల రూపాయలు విలువగల వెండి ఆభరణాలు అందజేశారు. విజేతలకు చీరలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి జోగి కుమారి, నాగుల భవాని, లక్ష్మీ గణపతి ఆలయ కమిటీ సభ్యులు, పెద్దలు, యూత్, మహిళలు పాల్గొన్నారు.

ఆలిండియా బ్యాడ్మింటన్‌లో అభిషేక్‌కు 3వ స్థానం

ప్రజాశక్తి - రామచంద్రపురం

మోడరన్ విద్యార్థి బోను అభిషేక్ అండర్-15 ఆలిండియా బ్యాడ్మింటన్ డబుల్స్‌లో 3వ స్థానాన్ని సాధించాడు. ఈనెల 14 నుంచి 19 వరకు హైదరాబాద్‌లో జ్వాలా గుత్తా అకాడమీ అఫ్ ఎక్సలెన్స్ ఆధ్వర్యంలో జరిగిన యోనెక్స్ -సన్ రైజ్ 35వ సబ్ జూనియర్ నేషనల్ బాడ్మింటన్ అండర్ -15 డబుల్స్ ఛాంపియన్ షిప్-2023లో అభిషేక్ పాల్గొన్నాడు. జాతీయ స్థాయిలో 3వ స్థానం సాధించి సత్తా చాటుకున్నాడని మోడరన్ విద్యాసంస్థల అధినేత జివి.రావు తెలిపారు. ఈ సందర్భంగా అభిషేక్‌ను మోడరన్ అధినేత జివి.రావు, అకడమిక్ డైరెక్టర్ ఆర్.ఉమాదేవి అభినందించారు. అభిషేక్ భవిష్యత్‌లో దేశం గర్వించదగ్గ గొప్ప క్రీడాకారుడు అవుతాడని ఆంక్షించారు. అభిషేక్ మాట్లాడుతూ మోడరన్ అధినేత జివి.రావు అందిస్తున్న సహకారంతోనే ఈ విజయం సాధ్యమైందన్నారు. మోడరన్ హైస్కూల్ హెచ్ఎం ఎం.చిట్టిబాబు, సిబ్బంది, తోటి విద్యార్థులు అభిషేక్‌కు అభినందనలు తెలిపారు.

సుబ్బారావుకు ఇఒపిఆర్‌డిగా ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి - ఆలమూరు



మండలంలోని మోదుకూరు, గుమ్మిలేరు క్లస్టర్ పంచాయతీల కార్యదర్శిగా పనిచేస్తున్న దంగేటి సుబ్బారావుకు ఇఒపిఆర్‌డిగా ఉద్యోగోన్నతి లభించింది. పంచాయతీ కార్యదర్శులకు ఉద్యోగోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో ఆయనకు ఇఒపిఆర్‌డిగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ కలెక్టరేట్ నుంచి ఆయనకు ఉత్తర్వులు అందాయి. ఒకటి, రెండు రోజుల్లో ఇఒపిఆర్‌డిగా పోస్టింగ్ ఇవ్వనున్నారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సుబ్బారావును పలువురు నాయకులు, అధికారులు అభినందనలు తెలిపారు.

వైసిపి మండల అధ్యక్షునిగా రాము

ప్రజాశక్తి -మామిడికుదురు



వైసిపి మామిడికుదురు మండల అధ్యక్షునిగా మళ్లీ కొమ్ముల రాము నియమితులయ్యారు. ఈ మేరకు వైసిపి కేంద్ర కార్యాలయం నుంచి బుధవారం ఆదేశాలు వెలువడ్డాయి. రాము నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు కాకరపర్రు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - పెరవలి

నియోజవర్గ స్థాయి ఆటల పోటీలు నిడదవోలు పట్టణంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగాయి. ఈ పోటీల్లో కాకరపర్రు జడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు రాణించి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. అండర్ 17 విభాగంలో బాలికలకు జరిగిన పోటీలో జి .మేఘనాదేవి, జి .దుర్గా లక్ష్మి, జి .జయశ్రీ ప్రసన్న, పల్లేటి నిఖిత, డి. భాగ్యశ్రీ, డి .వరలక్ష్మి ఎంపికయ్యారు. కబాడీ పోటీలో పి .నిఖిత, కె .రామదుర్గ, జి. దుర్గాలక్ష్మి, బ్యాట్మెంటన్ సింగిల్స్‌లో పి. హిమబిందు, ఎస్ .లక్ష్మి దుర్గ ఎంపికయ్యారు. అలాగే డిస్క్ త్రో పోటీలో పి.నిఖిత, ఎస్.రూపశ్రీ, లాంగ్ జంప్‌లో పి.నిఖిత, అండర్ 17 బాలురు విభాగంలో ఖోఖో పోటీలో పి.దుర్గాసాయి సంతోష్, ఆర్.తేజ, 400 మీటర్స్ పోటీలో సంతోష్ రెండో స్థానంలో నిలిచారు. అలాగే అండర్ 14 విభాగంలో బాలికలకు జరిగిన షెటిల్ బ్యాట్మెంటన్‌లో టి.ధరణి, కె.మౌనిక రాణించగా, ఖోఖో పోటీలో కె.భార్గవి, ఎస్.గాయంత్రి దుర్గ, ఆర్.కీర్తి వి.గ్రేస్, కె.జ్ఞానేశ్వరి, ఎన్.మహిమ కుమారి, కబాడీ బాలుర విభాగంలో పాల నాగచైతన్య ఎంపికయ్యాడు. ఈ క్రీడల్లో రాణించిన క్రీడాకారులను హెచ్ఎం, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది అభినందించారు.

ఎంఎల్ఎకు అగ్రిగోల్డ్ బాధితుల వినతి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

రాష్ట్ర అగ్రిగోల్డ్ కస్టమర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పిలుపు మేరకు అగ్రిగోల్డ్ బాధితులు బుధవారం ఎంఎల్ఎ పొన్నాడ వెంకటసతీష్‌కుమార్‌కి సిపిఐ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. తానేలంక సచివాలయం సిబ్బంది నిర్లక్ష్య వైఖరి వల్ల బాధితులకు సొమ్ములు అందలేదని సత్తిబాబు తెలిపారు. తహశీల్దార్, కలెక్టర్‌కు విన్నవించినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. దీనిపై ఎంఎల్ఎ స్పందించారు. బాధితులకు న్యాయం జరిగేలా చూస్తానన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పి.సురేష్‌కుమార్, కార్యదర్శి శీలం లంకేశ్వరుడు, ట్రెజరర్ పి.శ్రీరామ్మూర్తి, బాధితులు పాల్గొన్నారు.